ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 22 అక్టోబరు 2025


నాగసర్పం ఆకారంలో మెట్ల మార్గం

ఓం నమః శివాయ

● కార్తీకమాసం ప్రారంభం ● శివనామస్మరణతో మార్మోగనున్న శైవక్షేత్రాలు

కడప కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శివుడికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కొండా కోనల్లో కొలువైన శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. శివనామస్మరణతో మారుమోగనున్నాయి. మాసాల్లో కార్తీకం, యుగాల్లో కృతయుగం, శాస్త్రాల్లో వేదం, తీర్థాల్లో గంగానదికి సమానమైనది లేదన్నది పురాణ వచనం. కార్తీక మాసమంతా పూజలు, వ్రతాలు, దీపారాధనలు, నోములు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో దైవారాధనలో ప్రజలు నిమగ్నమవుతారు. కార్తీక మాసం మొదటిరోజున శివాలయాల్లో ఆకాశ దీపం వెలిగిస్తారు. ధ్వజ స్తంభానికి తాడు కట్టి చిన్న పాత్రలో దీపం వెలిగించి పైకి ఎత్తుతారు. అరటి దొప్పల్లో ఉంచిన దీపాలను వెలిగించి నదీ ప్రవాహాలలో వదులుతారు.

మహిమాన్వితం.. ప్రదోషకాలం

కార్తీకమాసంలో ప్రదోషకాలంలో ఆదిదేవుని ఆరాధించడం వలన అత్యంత మహిమాన్వితమైన ఫలి తాలు కలుగుతాయని శాస్త్రం చెబుతోంది. సూర్యాస్తమయం తరువాత రాత్రికి ఆరంభ కాలమే ప్రదోషకాలం. ఆ కాలంలో పరమశివుడు ఏక కాలంలో రెండు రూపాలలో (ఈశ్వరుడు, అర్ధనారీశ్వరుడు) దర్శనమిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ ప్రదోషకాలంలో శివార్చన చేస్తే సకల దేవతల అనుగ్రహం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

నాగనాథేశ్వర కొండలో..

ఖాజీపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీలోని నాగనాథేశ్వర కొండ కార్తీకమాసం సందర్భంగా శివనామ స్మరణతో మారుమోగనుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో.. ఎత్తైన కొండపై వెలసిన శివుడిని, పార్వతీదేవి అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

తలుపులు లేని గుడి

ఇక్కడి స్వామివారికి సంబంధించి ఓ విశేషమైన కథ జనబాహుళ్యంలో ఉంది. ఖాజీపేటకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో నాగనాథేశ్వరుని కొండపైభాగంలో స్వయంభు లింగంగా ఉన్న స్వామిని చూసిన భక్తులు ఇక్కడ గది ఏర్పాటు చేసి తలుపులు బిగించారు. అయితే స్వామివారు ఆగ్రహించి తలుపులను తన్నడంతో అవి పుల్లూరు చెరువులో పడ్డాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు స్వామివారి ఆలయా నికి తలుపులు బిగించలేదు. కొండ పైభాగంలో నాగమల్లిక నుంచి లంకమల్లకు సొరంగమార్గం ఉందని, ఈ మార్గాన దేవకన్యలు కార్తీక పౌర్ణమి రోజు కొండపైభాగాన ఉన్న కొలనులో స్నానమాచరించి శివుని ఎదుట నాట్యం చేసేవారని చెబుతుంటారు.

కొండపైకి రోడ్డు మార్గం

గతంలో నాగసర్పంలా కొండపైకి భక్తులు మెట్లు ఏర్పాటు చేశారు. మెట్ల మార్గంలో ఓం నమఃశివాయ అంటూ శివుడిని స్మరించుకుంటూ మెట్లు ఎక్కేవారు. ప్రస్తుతం వాహనాలు వెళ్లేందుకు కొండపైకి రోడ్డు మార్గాన్ని దువ్వూరుకు చెందిన లక్ష్మిరెడ్డి ఏర్పాటు చేశారు. దీంతో అన్ని వాహనాలు కొండపైకి చేరుకుంటున్నాయి.

అన్నదానం

స్వామివారిని దర్శించుకునేందుకు కొండపైకి వచ్చే భక్తులకు ప్రతి సోమవారం అన్నదానం జరుగుతుంటుంది. కార్తీక మాసాల్లో అయితే అధిక సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కార్తీకమాసంలో శివుని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అంతరాయాలు కలుగకుండా గట్టి బందోబస్తు చేపట్టనున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో నాగనాథేశ్వరుడు, పార్వతీదేవి అమ్మవారు



కరెన్సీ అమ్మవారు

పోరుమామిళ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని పోరుమామిళ్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కమిటీ సభ్యులు అమ్మవారిని రూ.4 లక్షల కొత్త నోట్లతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని పూజలు చేశారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వజ్రాల వేటకు పల్లె జనం

● గ్రామాల్లో లభించని ఉపాధి ● కలిసొచ్చిన స్త్రీ శక్తి పథకం

కాశినాయన, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉప్పలూరు, కొత్త ఉప్పలూరు, నర్సాపురం, చెన్నారెడ్డి పల్లె సమీపంలోని ఎస్సీ కాలనీ తదితర గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు వజ్రాల వేటకు వెళుతున్నారు. కాశినాయన మండలానికి దాదాపు 50 కి.మీ. దూరంలో ఉన్న నంద్యాల జిల్లా దిగువమెట్ట సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఈ వజ్రాల అన్వేషణ సాగుతోంది. దీంతో పది పదిహేను రోజులుగా కాశినాయన మండలంలోని వివిధ గ్రామాల నుంచి బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా పోయి నాలుగైదు రోజులుగా అక్కడే మకాంవేసి వజ్రాలకోసం అన్వేషణ సాగిస్తున్నారు. నంద్యాల గిద్దలూరు మధ్య పచ్చర్ల దిగువమెట్టలో ఉన్న సర్వ నరసింహ స్వామి ఆలయ సమీపంలోని నల్లమల అటవీ ప్రాతంలో నీరు ప్రవహించే వాగులో వజ్రాల కోసం వేలమంది జల్లెడ పడుతున్నారు. అదృష్టం వరించి వజ్రం దొరికితే రాత్రికి రాత్రే లక్షాధికారి కావచ్చుననే ఆశతో ఒకరిని చూసి మరొకరు అన్నట్లు అక్కడకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు.

పగటి పూట ప్రవహించే వాగులో రంగురాళ్ళ, వజ్రాలకోసం వెతుకుతున్నారు. రాత్రయితే ఆలయ సమీపంలోని పరిసర ప్రాంతాల్లో నిద్రిస్తున్నారు. ఒకవైపు విపరీతమైన దోమలు మరోవైపు చలి అడపా దడపా కురుస్తున్న వర్షాలను సైతం లెక్కచేయకుండా ప్రజలు వజ్రాల అన్వేషణ కొనసాగిస్తున్నారు. టైగర్ జోన్ అయినందున పులులు సంచరిస్తుంటాయని ఒకవైపు పోలీసులు హెచ్చరిస్తున్నా జనం పట్టించుకోకుండా వజ్రాల వేటలో జనం నిమగ్నమై పోతున్నారు.

ప్రస్తుతం పల్లెల్లో ఉపాధి పనులు, ఇతర వ్యవసాయ పనులు లేకపోవడం, ఆర్టీసీ బస్సుల్లో స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణం ఉండటంతో మహిళలు ఎక్కువగా తరలిపోతున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో ఇదో వారికి దొరికింది వీరికి దొరికింది వజ్రం అంటూ పుకార్లు షికార్లు చేస్తుండటం కూడా ప్రజలను అటువైపు అడుగులు వేసేలా చేస్తోంది. బద్వేలు నుంచి కాశినాయన మీదుగా కర్నూలు వెళ్లే బస్సు ఈమధ్యకాలంలో వజ్రాల అన్వేషణకు వెళ్లే మహిళలతో కిటకిటలాడుతోంది. వజ్రాలు దొరుకుతాయే లేదో తెలియదుగాని పల్లె ప్రజలు సరైన నిద్రాహారాలు లేకుండా తెల్లవారకముందే మూటే ముళ్లే సర్దుకుని వెతుకులాటకు పరుగులు పెడుతున్నారు.


నంద్యాల జిల్లా దిగువమెట్ట సమీపంలోని వాగులో వజ్రాల కోసం అన్వేషిస్తున్న జనాలు


అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద కడప -బద్వేలు ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

జడివాన

● నగరంలో పలు ప్రాంతాలు జలమయం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. కడప నగరంలో వర్షం కారణంగా ప్రధాన రహదారులు, వీధులు నీట మునిగిపోయాయి. అప్సరసర్కిల్, కొత్త బస్టాండ్, రామాంజనేయపురం, హోమియోపతి కళాశాల రోడ్‌తో పాటు మరికొన్ని ప్రధాన వీధుల్లో నీరు నిలిచిపోయింది. వర్షపునీరు కాల్వల్లోకి సరిగా వెళ్లకపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు చెరువుల్లా మారడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయమైంది. నగరపాలక సంస్థ అధికారులు వీధుల్లో నిలిచిన నీటిని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అట్లూరులో..

అట్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి ప్రధాన రహదారి చెరువులా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల కారణంగా వర్షం నీరుపోయే మార్గం లేక రోడ్డుపై నిలిచిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై నిలబడ్డ నీటిని తొలగించాలని వారు కోరారు.


కడప నగరంలో కురుస్తున్న వర్షం

బి.కోడూరులో..

బి.కోడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పాడి రైతులు, గొర్రెలు, మేకల రైతులు వాటిని మేతకు తోలుకుని వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోర్ల కింద సాగు చేసిన వరి పైరు చేతికి అందే దశలో ఉంది. రెండురోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో వరిపంట దెబ్బతింటుందేమో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి చల్లని గాలులు వీచాయి. మంగళవారం ఉదయం 8.45 గంటల నుంచి 10 గంటల వరకు మోస్తారు వర్షం కురిసింది. తర్వాత చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం వరకు అప్పుడప్పుడు వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి జనం ఇబ్బంది పడ్డారు.

బోధన పరిశోధనలపై ప్రత్యేక దృష్టి : వైవీయూ వీసీ



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బోధన, పరిశోధన నైపుణ్యాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్లు వైవీయూ వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగంలో మూడేళ్లలో దేశంలోనే అగ్రగామి యూనివర్సిటీలో ఒకటిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. మంగళవారం యూనివర్సిటీలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్లలో వైవీయూను రాష్ట్రంలో నెంబర్ వన్ విశ్వవిద్యాలయంగా నిలబెట్టి 2027లో న్యాక్ ఏప్లస్ ప్లస్ గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ వందలో స్థానం సాధించాలన్నదే లక్ష్యమన్నారు. డిసెంబరు 31లోపు కాన్వొకేషన్ నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం 98 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీతో విశ్వవిద్యాలయం బలంగా ఉందని, 1700 పరిశోధన పత్రాలు స్కోప్, వెబ్ ఆఫ్ సైన్స్ వంటి ప్రామాణిక జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయని తెలిపారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఏఎన్ఆర్ఎఫ్)లో 7 స్పోక్ యూనివర్సిటీల్లో ఒకటిగా వైవీయూ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. రూ.10కోట్ల రీసెర్చ్ ప్రాజెక్టులు, ప్రధాని ఉచ్ఛతర శిక్ష అభియాన్ ద్వారా రూ.20కోట్ల నిధులు వచ్చాయన్నారు. పరిశ్రమలతో అనుసంధానం చేసి, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి కొత్త కోర్సులు ప్రవేశపెడతామన్నారు. ప్రతి కళాశాలలో కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ ఎల్.సుబ్రమణ్యంశర్మ, పీఆర్ఓ డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా జి.ఈశ్వరయ్య



కడపసెవెన్‌రోడ్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా జి.ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడలోని దాసరి భవన్‌లో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా నేతృత్వంలో జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో ఈశ్వరయ్యను సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కె.రామకృష్ణను జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ.. ఈశ్వరయ్య ప్రాథమిక విద్య చదువుతుండగానే విద్యార్థి ఉద్యమానికి ఆకర్షితుడై ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ ఉపాధ్యక్షునిగా పనిచేశారన్నారు. నిరుద్యోగ సమస్యలపై పోరాటాలు నిర్వహించారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా మూడు పర్యాయాలు, నీటిపారుదల ప్రాజెక్టు కోసం, కడప ఉక్కు పరిశ్రమ కోసం, కరోనా సమయంలో సేవా కార్యక్రమాలలో క్రియాశీల పాత్ర పోషించారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యునిగా, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ప్రజా సమస్యలపై, రైతు సమస్యలపై, కార్మిక సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఈశ్వరయ్యను సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల కడప జిల్లా సమితి హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ఈశ్వరయ్యను గాలిచంద్రతో పాటు సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మహేశ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, నాగసుబ్బారెడ్డి, వీరశేఖర్, వెంకటశివ, చంద్రశేఖర్ తదితరులు కలిసి అభినందలు తెలిపారు.

పోలీసుల సేవలు అజరామరం

● జిల్లా రెండో అదనపు జడ్జి సత్యకుమారి


కడపక్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు వెలకట్టలేనివని జిల్లా రెండో అదనపు జడ్జి సత్యకుమారి కొనియాడారు. ప్రజల క్షేమం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని ఎప్పటికీ మరువలేమన్నారు. మంగళవారం నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల స్మృతి పరేడ్‌కు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌తో పాటు జిల్లా రెండో అదనపు జడ్జి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసుల అమరవీరుల స్థూపం వద్ద జడ్జి, ఎస్పీ పుష్ప గుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ దేశానికి సైనికులు, పోలీసు వ్యవస్థ రెండు కళ్లు లాంటివన్నారు. కళ్లు బాగు న్నప్పుడే సమాజం సురక్షితంగా ఉంటుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసు, హోంగార్డుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందిం చారు.

ఛాయాచిత్ర ప్రదర్శన

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పరేడ్‌గ్రౌండ్‌లో జిల్లా పోలీసుశాఖ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన ఛాయాచిత్రాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఎస్పీ దగ్గరుండి ఒక్కో ఛాయా చిత్రానికి సంబంధించి వివరాలను జడ్జికి విశదీకరించారు. అనంతరం పోలీ సులు వినియోగించే ఆయుధాలు, సామగ్రి ప్రదర్శన ఓపెన్‌హౌస్ ఏర్పాటు చేశారు. నేర పరిశోధనలో కీలకమైన డాగ్‌స్క్వాడ్ బృందంలోని దయానా, రూబీ, లూసీ, జిమ్మీ, సోనులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.ప్రకాశ్‌బాబు, రమణయ్య, డీఎస్పీలు సుధాకర్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, భావన, వెంకటేశ్వర్ రావు, అబ్దుల్‌కరీం, బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.


ఓపెన్‌హౌస్‌లో ఆయుధాల గురించి జిల్లా రెండో అదనపు జడ్జి సత్యకుమారికి వివరిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్


పోలీసు అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



గలగలా జలపాతం

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. కొండాకోనల్లోని జలపాతాలు నీటి గలగలలతో రారమ్మని ఆహ్వానిస్తున్నాయి. ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు జలపాతాల వద్దకు వెళ్లి సందడి చేస్తున్నారు. మంగళవారం సిద్దవటం మండలంలోని నిత్యపూజ స్వామి కోనలో జలపాతం వద్ద భక్తులు సరదాగా గడిపారు

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

నీళ్లు లేని చెరువులు ... బీళ్లుగా భూములు

- రాజంపేట డివిజన్‌లో చెరువుల్లో నీరు లేక వెలవెల
- దిగాలు చెందుతున్న రైతన్నలు

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రమంతా భారీ ఎత్తున వర్షాలు కురిసి నదులు, వాగులు పొంగి ప్రవహిస్తూ చెరువులు, కుంటలు, బోరుబావులకు పెద్దఎత్తున నీరు చేరి వ్యవసాయానికి సిద్ధమై పచ్చని పంట పొలాలతో కళకళలాడుతుండగా రాజంపేట డివిజన్‌లో పూర్తిగా కరవు ఛాయలు ఏర్పడ్డాయి. అప్పుడప్పుడూ చెదురుమదురు వర్షాలు కురుస్తూ గడ్డి, కంపచెట్లు పచ్చగా మారగా ఎక్కడా కనీస వర్షపాతం కూడా పడలేదు. ఏడాదికి 720 మి.మీ. కనీస వర్షపాతం రాజంపేట ప్రాంతంలో కురవాల్సి ఉండగా ఇప్పటికి 200 మి.మీ. వర్షపాతం కూడా నమోదు కాలేదు.

తిరుపతి జిల్లాకు శేషాచలం అడవులు ఆనుకుని ఉన్న ఒక్క రైల్వేకోడూరు మండలంలో కొద్దిపాటి వర్షం పడింది తప్ప మిగిలిన మండలాల్లో దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మామూలుగా ఉమ్మడి కడప జిల్లాలో పంట పొలాలకు, పాడికి రాజంపేట డివిజన్ పెట్టింది పేరు. ఇక్కడ 200కు పైబడి చెరువులు, కుంటలు ఉన్నాయి. ఒక్క ప్రాజెక్టు లేక పోయినప్పటికి ఒకవైపు శేషాచలం కొండలు, మరోవైపు నెల్లూరు సరిహద్దు పెనుశిల అభయారణ్య అడవులు ఉండడం వల్ల సహజంగానే వర్షాలు కురవడం. దీనివల్ల చెరువులు, కుంటలు నిండడం, బోరుబావుల్లో



చెరువులో నీరు లేక సాగుకు నోచుకోని భూములు

చుక్కనీరు లేక వెలవెలబోతున్న ఊటుకూరు చెరువు



భూగర్భజలాలు పెరగడం, తద్వారా లక్ష ఎకరాలకు పైబడి సాగవుతూ ఉండేది. చెరువులు, కుంటల కిందే ఈ లక్ష ఎకరాల వరి పంట పండేది. వరి ధాన్యం విస్తారంగా పండడం వల్ల ఈ రెండు నియోజకవర్గాల రైతులకు పుష్కలంగా ఏడాదికి కావాల్సిన ఆహారం లభించి వేల టన్నుల వరి పంటను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి లాభాలు గడించేవారు. రెండు సంవత్సరాలుగా ఏమైందో ఏమోగాని కనీస వర్షపాతం నమోదు కాలేదు. ఒక మోస్తరు వర్షాల వల్ల తాగునీరు లభిస్తుందే తప్ప సాగునీరు లభించడం లేదు. రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట, ఒంటిమిట్ట ప్రాంతాల్లోని పెద్దఓరంపాడు చెరువు,

చుక్కనీరు లేక రైతులను వెక్కిరిస్తున్న హస్తవరం చెరువు



ఎల్లమరాజుచెరువు, రెడ్డిపల్లె చెరువు, నగిరిపాడు చెరువు, నాగవరం, చెరువులు, ఊటుకూరు, చెర్లోపల్లె, తాళ్లపాక, లేబాక, ఒంటిమిట్ట, మైలపల్లెల్లోని వందలాది చెరువులు వరదనీరు రాక చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. దీనివల్ల ఆయకట్టు భూములన్నీ బీటలు వారి ఉన్నాయి. ఒక్కో రైతుకు చెరువుల కింద ఎకరా నుంచి 50 ఎకరాల పొలం ఉన్న రైతులున్నారు. ఈ పొలాలన్నీ వరి పంట పండేవే. అయితే వర్షాలు పడకపోవడంతో ఈ భూములన్నీ ప్రస్తుతం బీటలువారి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో మాత్రం వరి పంట విస్తారంగా సాగవుతోంది.

రెండేళ్లుగా వర్షాలు అంతంత మాత్రమే



రెండేళ్లుగా వర్షాలు కురవక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ సమయానికే బాగా వర్షాలు కురిసి వరి పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం వర్షాలే కురవకపోవడంతో భూములన్నీ బీళ్లుగా పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల వరి పంట పండించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి పరిస్థితి నుంచి ఇంటి అవసరాలకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

-బండారు బాలయ్య, రైతు, మన్నూరు, రాజంపేట

లక్ష ఎకరాల్లో సాగయ్యేది



బాగా వర్షాలు కురిస్తే రాజంపేట డివిజన్‌లో చెరువులు, బోరు బావులు, కుంటల కింద లక్ష ఎకరాల్లో వరి పంట సాగయ్యేది. అటువంటిది చెరువుల కింద ఒక్క ఎకరా కూడా పండే పరిస్థితి కనిపించడం లేదు వాతావరణ ప్రతికూల పరిస్థితులే ఇందుకు కారణం. ఏ గ్రామంలో చూసినా చెరువుల కింద వేల ఎ కరాల్లో వరిని సాగు చేస్తూ పచ్చని పొలాలతో కళకళలాడే పరిస్థితి నుంచి నేడు ఎకరా సాగు కాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

- మధుసూదన్‌రెడ్డి, రైతు, తాళ్లపాక, రాజంపేట మండలం

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు మెస్‌లో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం పులివెందుల జేఎన్టీయూలోని మెస్ ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెస్ ఇన్‌చార్జి, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి ఆయన వంటగది, ఆహార నిల్వ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం హాస్టల్ గదులు, పరిసరాలు, టాయిలెట్లు, డ్రింకింగ్ వాటర్ సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి వాతావరణం ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్దన్, మెస్ మేనేజర్ జి.మురళి పాల్గొన్నారు.

సీబీఆర్‌కు నీటి విడుదల నిలిపివేత



లింగాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు అధికారులు నీటి విడుదలను నిలిపివే శారు. గండికోట ప్రాజెక్టు నుంచి నెల రోజులుగా ఎత్తిపో తల ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 8.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హత్య కేసుగా నమోదు చేసిన టూటౌన్ పోలీసులు



శశికళ (ఫైల్)

మదనపల్లె అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం శేషప్పతోటకు చెందిన వెంకటరమణ, శశికళకు 30 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి సృజన్ అనే కుమారుడు, సాత్విక వర్షణీ అనే అమ్మాయి ఉన్నారు. వెంకటరమణ గతంలో బీఎస్ఎఫ్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు 20 ఏళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. అయితే కుమారుడు, కుమార్తె ఇద్దరూ తల్లి వద్దే ఉంటూ చదువుకున్నారు. ప్రస్తుతం కుమారుడు సృజన్ ఉద్యోగపరంగా బయట ఉండడంతో, కుమార్తె సాత్వికవర్షణీ లండన్‌లో ఎంఎస్సీ చదువుతోంది. వారిది సొంత ఇల్లు కావడంతో ప్రస్తుతం శశికళ ఒక్కరే ఇంట్లో ఉంటోంది. ఇదిలా ఉండగా ఈనెల 6వ తేదీ మదనపల్లెకు వచ్చిన వెంకటరమణ తన తమ్ముడు రాజన్నతో కలిసి శేషప్పతోటలోని ఇంటికి వెళ్లి ఇల్లు తన పేరిట ఉందని, తనకు ఇవ్వాలని భార్య శశికళతో గొడవపడ్డారు. దీనికి ఆమె నిరాకరించడంతో కొట్టి బలవంతంగా నోట్లో యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే ఆమె లండన్‌లోని తన కుమార్తెకు సమాచారం ఇచ్చింది. స్థానికులు శశికళను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మృతి చెందింది. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శశికళ కుమారుడు సృజన్ ఫిర్యాదు మేరకు టూటౌన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మంగళవారం హత్య కేసుగా మార్చామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

కారు, బస్సు ఢీ : నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెద్దమండ్యం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... పెద్దమండ్యం మండలం కోటకాడపల్లి పంచాయతీ తాటిమాకులపల్లి వాసి కుళాయిరెడ్డి, మదనపల్లిలో సచివాలయ ఉద్యోగి. కాగా ఆదే గ్రామానికి చెందిన స్రవంతి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వీరు దీపావళి పండుగకు స్వగ్రామానికి వచ్చి తిరిగి ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి మంగళవారం ఉదయం కలిచెర్ల బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నారు. కాగా గాలివీడు మండలం ప్యారంపల్లి పంచాయతీ పూలవాండ్లపల్లికు చెందిన జగదీష్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన స్నేహితుడితో కలిసి కారులో బెంగుళూరుకు బయలుదేరారు. కలిచెర్ల బస్టాప్ వద్ద చేరుకున్న కారులోని జగదీష్‌రెడ్డిని లిఫ్ట్ అడిగి అందులో బయలుదేరారు. బండమీదపల్లి పంచాయతీ కొట్టివాండ్లపల్లి డాబా వద్ద కారు అదుపు తప్పి మదనపల్లి నుంచి గాలివీడుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఆ నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. వీరిలో కుళాయిరెడ్డి, స్రవంతి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం పోలీసులు వెల్లడించారు.

విషద్రావణం తాగి మహిళ మృతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామం రాగిమాకులపల్లె వాసి విశ్వనాధరెడ్డి భార్య శారద (40) ఆదివారం కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి మనస్థాపంతో విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. సోమవారం సాయంత్రం మృతి చెందింది. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు

- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు
- అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం డైట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని 8 నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, చట్టపరమైన అవగాహనను పెంపొందించడానికి, లైంగిక దాడుల నుంచి మహిళలు, బాలల రక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలు రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రం, మదనపల్లి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్, రాజంపేట పట్టణంలోని మన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో డివిజన్ వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి జిల్లా స్థాయిలో పోటీలను 26వ తేదీ ఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడతాటలి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుమలో గంగమ్మ పూజకు వెళుతూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.. ముగ్గురికి గాయాలు





తేజ (ఫైల్), ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కనుమలో గంగమ్మ ఆలయంలో జరిగే పూజకు వెళుతూ జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళవారం ఉదయం కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ చింతయ్యగారికోటకు చెందిన యువకులు బైక్‌పై మదనపల్లె మండలం బసినికొండ గ్రామం, పుంగనూరు రోడ్డులో ఉన్న కనుమలో గంగమ్మ ఆలయంలో చేస్తున్న పూజా కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతూ బసినికొండ వద్ద జాతీయ రహదారి కూడలిలో రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో చింతయ్యగారికోటకు చెందిన రవి కుమారుడు తేజ (19) అక్కడికక్కడే మృతి చెందగా అతడి బైక్‌లో వెనకనున్న రాధాకృష్ణ కుమారుడు జగదీశ్ (20) గాయపడ్డాడు. మరో బైక్‌లో ఉన్న వేంపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు సంతోష్ (21), మహేశ్ కుమారుడు ప్రేమకుమార్ (8) గాయపడ్డారు. వేంపల్లె నుంచి నిమ్మనపల్లెకు తమ అక్క ఇంటికి బైక్‌లో బయలుదేరిన వీరి బైక్ తట్టివారిపల్లె వైపు నుంచి వస్తున్న బైక్‌ను ఢీ కొంది. స్థానికులు క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మదనపల్లె తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

భూములు దక్కలేదని వ్యక్తి ఆత్మహత్య

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వగ్రామంలో ఉన్న తమ భూములు తమకు దక్కలేదన్న బాధతో మద్యానికి బానిసైన గురజాల పాపారావు (48) సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడుకు చెందిన గురజాల పాపారావు కొంతకాలంగా రాయచోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో న్యాచురల్ జ్యూస్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని తమ భూముల కోసం అధికారుల చుట్టూ తిరిగినా, తమకు దక్కకపోవడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలియజేశారు.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో మృతి చెందిన వ్యక్తిని తన భర్తగా తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి ఆ వ్యక్తి కుటుంబాన్ని బెదిరిస్తున్న షేక్ అమీనా అనే మహిళపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు కడప టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు కడప అగాడికి చెందిన తాజున్నిసా అనే మహిళ భర్త మహబూబ్‌బాషా 2015లో మృతి చెందాడు. అయితే షేక్ అమీనా అనే మహిళ గత కొంతకాలంగా మహబూబ్‌బాషా తన భర్త అని, తమకు నసీమా అనే కుమార్తె కూడా ఉందంటూ వారిద్దరి మ్యారేజ్ సర్టిఫికెట్ చూపించి ఆస్తుల్లో భాగం కావాలని తాజున్నిసాను బెదిరిస్తుండేది. దీంతో ఆమె గురించి చుట్టుపక్కల విచారించగా ఆమె లక్ష్మీదేవి అని గుర్తించారు. దీంతో ఆమె దగ్గర ఉన్న మ్యారేజ్ సర్టిఫికెట్లను పరిశీలించగా అవి నకిలీవని గుర్తించినట్లు తెలిపారు. తాజున్నిసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ అమీనా అలియాస్ లక్ష్మీదేవిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బస్సు-లారీ ఢీ.. తప్పిన ప్రమాదం



బస్సు లారీ ఢీ కొన్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో మంగళవారం ఆర్టీసీ బస్సు లారీని ఢీకొంది. ఆర్టీసీ బస్సు బస్టాండ్ నుంచి ప్రొద్దు టూరు వెళ్లేందుకు బస్టాండు నుంచి సర్కిల్ సమీపానికి రాగానే ముద్దనూరు వైపు నుంచి కడప వైపు వెళుతున్న లారీ రావడంతో అదుపు తప్పి ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ఎవ రికీ ప్రమాదం జరగలేదు. ఆర్టీసీ బస్సు అద్దాలు పగిలా యి. కాగా, ఎర్రగుంట్ల బస్టాండు నుంచి ప్రొద్దుటూ రుకు వెళ్లే బస్సులన్నీ సర్కిల్‌ను చుట్టి రాకుండా రాంగ్ రూటు లో నేరుగా బ్రిడ్జిపైకి వెళ్లడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

8 మంది జూదరుల అరెస్టు

కడప క్రైం, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన 8 మంది జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసిన వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వల్లూరులో నలుగురు...

వల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లెలో మంగళవారం నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో జూదమాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జోనల్ మలేరియా అధికారిగా

అలెగ్జాండర్ బాధ్యతల స్వీకరణ



కడప (కలెక్టరేట్), అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): కడప జోనల్ మలేరియా అధికారిగా డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ మంగళవారం పాత రిమ్స్‌లోని జెడ్ఎంవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన టెక్కలి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కడప జోనల్ మలేరియా కార్యాలయాలనికి బదిలీపై వచ్చారు. రెండు నెలల కిందట జెడ్ఎంవోగా విధులు నిర్వహిస్తూ డాక్టర్ జమాల్‌బాష పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో ఇప్పటివరకు రిమ్స్ ఆర్ఎంవో శ్రీనివాసులు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.

ఉత్సాహంగా దీపావళి

కడప కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి పర్వదినాన్ని సోమవారం జిల్లా వ్యాపితంగా ప్రజలు జరుపుకున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పిల్లలు, పెద్దలు, టపాసులు కాల్చారు. కాగా కొన్ని చోట్ల ఇంటిల్లిపాది టపాసులు కాల్చేందుకు పోటీలు పడి మరీ ఉత్సాహంగా కాల్చారు.

దీపావళి అంటేనే సందడి..: దీపావళి అంటే చిన్న పిల్లలకు అత్యంత సందడితో పాటుగా ఎక్కడ లేని సంబరం కూడా. పిల్లలకు వారి తల్లిదండ్రులు అమ్మా కొత్త బట్టలు, ఇష్టమైన చాక్లెట్స్, స్వీట్లు కొనుగోలు చేసి ఇచ్చినప్పటికీ వారికి మాత్రం టపాసుల పేల్చాలన్న ఆశ మాత్రం వీడదు.

రంగు రంగుల దీపావళి..: కొత్తగా వాడకంలోకి వచ్చిన టపాసులను కొనుగోలు చేసేందుకు ప్రజలు మక్కువ చూపారు. అందులో సీతాకోక చిలుక, టెన్ ఇన్ ఒన్, ఫ్లవర్ పాట్స్, రాకెట్స్, భూ చక్రాలు, పేలుస్తూ దీపావళి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు ఇంటిముందు ప్రమిదలతో దీపాలను వెలిగించి సంతోషంగా పండుగను ఆస్వాదించారు.



టపాసుల కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న మునిసిపల్ మైదానం

బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కేటాయించి సీట్లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పాత రిమ్స్‌లో ఉన్న బీసీభవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా లింగమూర్తి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేలా రానున్న ఎన్నికల నాటికి చట్టసభలో సైతం 34 శాతం రిజ ర్వేషన్ కల్పించి తద్వారా బీసీలకు రాజకీయ రంగంలో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గురుస్వామి, ప్రధాన కార్యదర్శి త్రివిక్రం, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, రామచంద్రుడు, నజీర్, సలహాదారుడు ఖాదర్‌బాషా, చేలో రవి, నగర కమిటీ కార్యదర్శి హరి కుమార్, అధ్యక్షుడు నరసింహులు, మన్నూరు అక్బర్, యువజన విభాగం అధ్యక్షుడు సీఆర్ఐ సునీల్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి



దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

కడప మారుతీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాది రాకేశ్‌కిశోర్‌పై కేంద్రం వెంటనే సుమోటాగా కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎమ్మార్పీఎస్ఎస్) రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరుబాబు డిమాండ్ చేశారు. బీఆర్ గవాయ్‌పై చేసిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొట్టం సుబ్బారావు, నగర అధ్యక్షుడు సునీల్‌కుమార్, కార్యదర్శిరాజు, నాయకులు ఓబులపతి, నాగేంద్ర, భరత్, వెంకటేశ్, రాజా, ఆర్పీఎస్ రాష్ట కార్యదర్శి మల్లెల జగదీశ్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లింపు

వేంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో నీటిసరఫరా కోసం పనిచేస్తున్న పంచాయతీ సిబ్బంది 58 మందికి ఏడు నెలలుగా చెల్లించాల్సిన వేతనాలను చెల్లించినట్లు ఈఓ నాగభూషణంరెడ్డి తెలిపారు. పంచాయతీలో ఈఓ లేక పాలన అస్తవ్యస్తం కాగా పారిశుధ్యం, తాగునీటటి సరఫరా సిబ్బందికి వేతనాలు చెల్లించని దుస్థితి నెలకొంది. 15 రోజుల క్రితం పారిశుద్య సిబ్బందికి చెల్లించాల్సిన ఆరు నెలల వేతనం రూ.32లక్షలు చెల్లంచగా తాజాగా నీటి సరఫరా సిబ్బందికి రూ.22లక్షలు చెల్లించినట్లు ఈఓ తెలిపారు. నెలనెలా వేతనం పంపిణీ చేస్తామని తెలిపారు.

అనాథలతో 'మానవత' దీపావళి పండుగ

వేంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో దీపావళి పండుగను వేడుకగా జరుపుకొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ఆవరణంలో టపాసుల విక్రయ దుకాణాలను ఏర్పాటుచేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వేంపల్లె ఫైర్‌స్టేషన్ సిబ్బంది, దుకాణాల సమీపంలో అగ్నిమాపక వాహనాన్ని ఉంచి విధులు నిర్వహిం చారు. మానవతా సంస్థ అధ్యక్షుడు యోగీశ్వర్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక గండిరోడ్డులోని అనాథ శరణాలయంలోని అనాథలు, వృద్ధులతో కలిసి దీపావళి సంబరాలు జరుపుకొన్నారు.

రైతుల ముఖాల్లో దీపావళి లేదు.. తులసిరెడ్డి: రైతుల ముఖాల్లో దీపావళి లేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకు పోయారని తెలిపారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతులందరూ తీవ్ర వేదనలో ఉన్నారని తెలిపారు. రబీలో సాగుచేసేందుకు బుడ్డశనగలు ఇప్పటికీ ఇవ్వకపోవడం రైతులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

ఎస్‌జీఎఫ్ డివిజనల్ స్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ



డివిజనల్ స్థాయి అండర్-14 కబడ్డీ జట్టు

పులివెందుల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రమణప్ప)లో మంగళవారం ఎస్‌జీఎఫ్ డివిజనల్ స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్,యోగ, బ్యాడ్మింటన్, చెస్ పోటీలలో ఎనిమిది మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ డివిజనల్ కోఆర్డినేటర్ ఫ్రాన్సిస్ రవికుమార్, జిల్లా కార్యదర్శి విక్టర్ ఇమ్మానియేల్, ఆర్గనైజర్స్ జీవిసీ కేల్కర్, టి.ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయా పోటీలలో డివిజనల్ స్థాయి జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు.

కుక్కలు బాబోయ్...కుక్కలు

వేంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోకుక్కలు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రధాన రోడ్లతో పాటు సందుసందులో కుక్కలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇక రాత్రి అయితే వీధుల్లో తిరిగేందుకు చిన్నపిల్లలతో పాటు పెద్దలు కూడా భయపడాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో పలువురు గాయపడిన ఘటనలు జరిగాయి. ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది.కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించాలని స్థానిక పంచాయతీ అధికారులను ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈఓ నాగభూషణంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



రాహుకాల దీప కాంతుల్లో విజయదుర్గాదేవి ఆలయం



పూజలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలో గల విజయదుర్గాదేవి ఆలయం మంగళవారం రాహుకాల దీప కాంతులతో ప్రకాశించింది. అమ్మవారి సన్నిధిలో రాహుకాల దీపాలు వెలిగించేందుకు మహిళా భక్తులు విశేషంగా తరలివచ్చారు. మధ్యాహ్నం3 నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు చేశారు. మంగళవారం అమావాస్య కావడంతో వందలాది మంది పూజలో పాల్గొని అమ్మవారికి నిమ్మకాయలతో కూడిన దీపాలు వెలిగించి పూజలు చేశారు.

డీఏ బకాయిల 60, 61 ఉత్తర్వులు సవరించాలి



మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 60, 61 ఉత్తర్వులను సవరించాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కడపనగరం ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుంచి 2025 సెప్టెంబరు వరకు ఉన్న బకాయిలను పదవీ విరమణ సమయంలో లేదా వారసులకు మాత్రమే చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొనడం దుర్మార్గమన్నారు. కాగా జీఓ నెంబరుల 60, 61లను తక్షణం సవరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వాయిదాల చెల్లింపులు, రిటైర్డ్ ఉద్యోగులకు నగదు చెల్లింపులో ఉన్న వివక్షతను తొలగించాలని కోరారు. సభలో జిల్లా నాయకులు ఖాదర్‌బాష, శ్రీనివాసరెడ్డి, చిన్నగురయ్య, నరసింహులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇచ్చిన మొట్టమొదటి డీఏలో 21 నెలల బకాయిలు ఉద్యోగి పదవి విరమణ లేదా మరణం అనంతరం లేదా రాజీనామా చేసిన తర్వాత చెల్లిస్తామని ఉత్తర్వు ఇవ్వడం దారుణం, శోచనీయమని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకటజనార్దనరెడ్డి, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శి అంకిరెడ్డిపల్లె మదన్‌మోహన్‌రెడ్డి, బి.ఖాదర్‌బాషా ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు ముందే పీఆర్సీ మధ్యంతర భృతి,ద్రవ్య భత్యాలు చెప్పినట్లు ఇవ్వడం లేదని ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు.

విత్తన శనగలు వెంటనే అందించాలి

కడప సెవెన్ రోడ్స్ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 50శాతం సబ్సిడీతో నాణ్యమైన శనగ విత్తనాలను రైతులకు వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్‌కి రైతు సంఘం నాయకులువినతిపత్రం ఇచ్చారు. రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులలు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ జిల్లా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాలలో ఈ రబీ సీజన్‌లో రెండు లక్షల ఎకరాలలో శనగ పంట వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలచంద్రయ్య నాయుడు,జిల్లా సమితి సభ్యులు ఎల్.విజయభాస్కర్‌రెడ్డి, కె.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కమలాపురం రూరల్..: రైతులు సాగుకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వం నుంచి బుడ్డశనగ విత్తనాలను వెంటనే పంపిణీ చేయాలని మాజీ హార్టీకల్చర్ రాష్ట్ర సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనరు ఉత్తమారెడ్డి అధ్యక్షతన రైతుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభ్యున్నతికి ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ సహకారం

వేంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు, అభివృద్ధి కోసం ప్రజలకు సేవా కార్యక్రమాలు చేసేందుకు ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుంటారని, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు తిరుపతిరెడ్డి,దీప్తి, గోవర్ధన్, సుబ్బరాయుడు తెలిపారు. తాళ్లపల్లె, కుమ్మరాంపల్లె,చక్రాయపేట మండలం కొండవాండ్లపల్లె, కుమార్లకాల్వలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు. శ్రమదానం చేశారు. ప్రజల్లో సామాజిక సేవా కార్యక్రమాలు పెంపొందించేందుకు ర్యాలీలు నిర్వహించారు.



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థినులు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బస్సుయాత్ర

కమలాపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి నవంబరు 12 వరకు జరగనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కోగటం సాదిక్ తెలిపారు. మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు.

కార్తీకశోభతో వెలుగొందనున్న శివాలయాలు

చెన్నూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుండడంతో అన్ని ఆలయాల కు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశారు. పదిరోజులుగా ఆలయాలను రంగులతోనూ, విద్యుద్దీపాలంకరణతో అలంకరించారు. అలాగే ఆలయాలను శుద్ధి చేసి కార్తీక మాసానికి సిద్ధం చేయడం జరిగింది. పుణ్యక్షేత్రమైన శివాలపల్లెలో దక్షిణ కాశీగా పేరొందిన కాశీవిశ్వేశ్వరాలయంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే చెన్నూరు పెన్నాతీరంలో కొలువు అయిన దాక్షాయణి మల్లేశ్వరస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే చెన్నూరు ఆర్అండ్‌బీ రోడ్డులోని లలితాంబికా సమేత నాగేశ్వరాలయంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొండపేట ఉమామహేశ్వరాలయం, ఉప్పరపల్లె నాగలింగేశ్వరాలయం, రామనపల్లె గిరిజాశంకర్ ఆలయం, కైలాసగరికోన గిరిజాసమేత సిద్ధలింగేశ్వరస్వామిఆలయం దేవరకొండలోని పాప నాగేశ్వర ఆలయాల్లో కొలువైన శివుడు బుధవారంనుంచి పూజలందు కునేందుకు సిద్ధమయ్యాడు.




చెన్నూరులోని శివాలయం



ఘనంగా వరల్డ్ స్టాటిస్టికల్ డే

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరు స్టాటిస్టిక్స్ సంబంధించిన టూల్స్‌ను క్షుణ్ణంగా నేర్చుకోవాలని వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ బెల్లం కొండ రాజశేఖర్ తెలిపారు. స్టాటిస్టిక్స్‌కు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని స్పష్టం చేశారు. మంగళ వారం వైవీలో స్టాటిస్టికల్ డే ఘనంగా నిర్వహించారు. అ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్యశ్రీనివాస్, ఐఎస్‌హెచ్ నోడల్ ఆఫీసర్ ఆచార్య కాత్యాయిని, టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ హరినాథ్, యూనివర్సిటీ అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

రాజమాత స్టీల్ హౌస్‌లో లక్కీడిప్ డ్రా

● బహుమతులు ప్రదానం చేసిన స్టీల్‌హౌస్ యాజమాన్యం



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకుడు సుబ్రమణ్యం

ప్రొద్దుటూరు , అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని గంగమ్మదేవళం వీధిలో ఉన్న రాజమాత స్టీల్ హౌస్ వారు దసరా దీపావళి సందర్భంగా లక్కీ డిప్ డ్రా ను మంగళవారం నిర్వహించారు. ఈ డిప్‌లో మొదటి బహుమతి శివజ్యోతికి రూ.10వేలు విలువ చేసే గ్రైండర్ బహుమతిగా రాజమాత స్టీల్ హౌస్ యాజమాని సుబ్రమణ్యం అందజేశారు. అలాగే రెండో బహుమతి నాగలక్ష్మికి రూ.5495 విలువ చేసే స్టీల్ రైస్ కుక్కర్, మూడో బహుమతి బాషాకి రూ.4595 విలువ చేసే ప్రెస్టీజ్ మిక్సర్ గ్రైండర్ ను అందజేశారు. వాటితో పాటు పదిమంది మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ దసరా, దీపావళి ఆఫర్‌కు లక్కీడిప్ డ్రా కు పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని సుబ్రమణ్యం తెలిపారు.

ఆకాశదీపం ఏర్పాటు

పోరుమామిళ్ల, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని మంగళవారం ఆకాశదీపం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మహిళలు మం గళగౌరీ అనుగ్రహం పొం దాలని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మహిళా సంఘం వారు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా దీపావళి సంబరాలు

● విరజిల్లిన బాణసంచా వెలుగులు ● కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి పూజలు ● ప్రతి ఇంటి ముంగిట దీపాల సొబగులు



ప్రొద్దుటూరులో కరెన్సీనోట్ల అలంకరణలో అమ్మవారు



జమ్మలమడుగులో బాణసంచా వెలుగులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆనందకేళి.. దీపావళి పండుగ సంబరాలను ప్రజలు సంతోషంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా చిన్నా, పెద్ద అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ బాణసంచా పేల్చి సంబరాలు జరుకున్నారు. పల్లెలు, పట్టణాలు బాణసంచా వెలుగులతో విరజిల్లాయి. కాగా ప్రొద్దుటూరు పట్టణంలోని పాత మార్కెట్‌లో గల లలితాదేవి రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా ఒక లక్ష కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి పూజలు నిర్వహించారు. అంతకు ముందు లలితాదేవి, శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ధనలక్ష్మి అమ్మవారిని ఆశీనులను చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ధనలక్ష్మిపూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో సోమవారం దీపావళి పండుగను ప్రజలు సంతోషభరితంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు టపాసులు పేల్చుతూ ఆనందంగా పండుగను జరుపుకున్నారు. పట్టణంలో పండుగను పురష్కరించుకుని 16 కాకర్స్ దుకాణాలను ఏర్పాటు చేశారు. దుకాణాలవారు నిబంధనలు పాటించలేదని అధికారులు సందర్శించి హెచ్చరికలు చేశారు. రాత్రి దీపావళి పురష్కరించుకుని వీధి వీధిలో టపాసులు కాల్చారు. ప్రతి ఇంటిలో, దుకాణాల్లో సంబంధిత యజమానులు దీపావళి లక్ష్మీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు, అగ్నిమాపక శాఖ అధికారి చంద్రశేఖరప్ప, వారి సిబ్బంది పర్యవేక్షించారు.

కొండాపురంలో: మండలంలో సోమవారం దీపావళి పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఇంటి వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. అంతకు ముందు బాణాసంచా పేల్చి పండుగను ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకున్నారు.

దువ్వూరులో: దువ్వూరులో దీపావళి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. మహిళలు వారి ఇళ్ల వద్ద దీపాలను వెలిగించి సంబరాలు చేసుకున్నారు. పిల్లలు టపాసులు కాల్చుతూ ముచ్చటపడ్డారు. స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో వాటి విక్రయ కేంద్రాలను ఏర్పరచి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చి టపాసులను కొనుగోలు చేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న పోలీసులు

బద్వేలుటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): : విధినిర్వ హణలో అశువులుబాసిన పోలీసు అమరవీరుల త్యా గాలు మరువలేనివని అర్బన్ సీఐ లింగప్ప, రూర ల్ సీఐ క్రిష్ణయ్యలు పేర్కొ న్నారు. మంగళవారం పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో అమరజవాన్ స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విధినిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులను స్మరించు కుంటూ పోలీసుఅమరవీరుల సంస్మరణదినంగా చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అర్బన్ సీఐ నరేష్‌బాబు, వారి సిబ్బంది అమరవీరులకు వారి త్యాగాలను స్మరించుకున్నారు. భారత్, చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో 1959 అక్టోబరు 21న చైనా సైనికుల దాడిలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందారని. వారి త్యాగాలకు గుర్తుగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జరుపుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అర్బన్ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంటలో: అమరవీరులైన పోలీసులకు ఎర్రగుంట్లలో పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమరవీరులకు సెల్యూట్ చేసి సంస్మరణసభను జరుపుకున్నారు. వారి త్యాగమే మన భద్రతకు పునాది అని ఎస్‌ఐ పేర్కొన్నారు. వీరులు మృతిచెందారని అయితే వారి చరిత్ర ప్రేరణగా మనహృదయాలలో చిరస్థాయిగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమలో జీఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

మైదుకూరు రూరల్,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలని మైదుకూరు వ్యవసాయ సంచాలకుడు క్రిష్ణమూర్తి హెచ్చరించారు. స్థానిక పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయఅధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పటణంలో పలు ఎరువుల దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను ,ఇన్వాయిస్ బిల్లులు చెక్ చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులను విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాశాఖ అధికారి బాలగంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె తప్పదు

బద్వేలు, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేయక తప్పడంలేదని కార్మిక సంఘ నేతలు పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈమేరకు తాము నవంబర్ 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్లు

బద్వేలు రూరల్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ వి.మల్లేశ్ కోరారు. మంగళవారం ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్ల, యజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ల్యాబ్ టెక్నీషియన్స్, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు

సీఎంను కలిసి టీడీపీ నాయకులు



సీఎంను కలిసిన టీడీపీ యువ నాయకులు చెరుకూరి రవికుమార్, నడిపి వెంకటసుబ్బయ్య

పోరుమామిళ్ల, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడును ఆయన సచివాలయంలో బద్వేలు నియోజక వర్గ యువ నాయకుడు చెరుకూ రి రవికుమార్, కమ్మవారిపల్లె టీడీపీ నాయకుడు కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గ కార్యకర్తల సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే బద్వేలు నియోజకవర్గం పోరుమామిళ్ల పట్టణంలో రవాణా, ట్రాఫిక్ రద్దీ ఎక్కువ అయి నందు వల్ల బైపాస్ రోడ్డు పరిశీలించాలని కోరారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందిం చారన్నారు. రాష్టంలో గూగుల్ డేటా సెంటరు రావడం ఏపీ చేసుకున్న అదృష్టమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగసముద్రం ఆయకట్టు ఛైర్మన్ చెరుకూరి వీరచెం ద్రాయుడు, అడ్వకేట్ తుమ్మలశ్రీధర్ పాల్గొన్నారు.

'రితీష్‌రెడ్డితోనే టీడీపీకి పూర్వవైభవం సాధ్యం'

కలసపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బద్వేల్‌లో టీడీపీకి పూర్వ వైభవంఒక రితీష్ రెడ్డితోనే సాధ్యమని నీటి సంఘం అధ్యక్షుడు చిన్నరంగారెడ్డి, టీడీపీ యువనాయకుడు స్వామిరంగారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవం నుంచి వీరారెడ్డి కుటుంబం పార్టీ కోసం అహర్నిశలు కృషిచేస్తోందన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉండి పార్టీని విజయమ్మ నడిపించారని ఆ కుటుంబాన్ని కార్యకర్తలు ఎప్పటికి మరువరన్నారు. తమ సంపూర్ణ మద్దతు విజయమ్మ కుటుంబానికేనని వారు తేల్చిచెప్పారు.

టి.కోడూరులో పది లిక్కర్ బాటిళ్లు స్వాధీనం

కొండాపురం, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు గ్రామంలో బెల్టుషాపుపై దాడులు నిర్వహించి మంగళవారం పోలీసులు పది లిక్కర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.గ్రామంలో అనుమతి లేకుండా చిన్ననాగప్ప అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా పది లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివ నాగిరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దత్తాపురంలో బాలుడు అదృశ్యం

కొండాపురం, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో దత్తాపురం గ్రామానికి యెందిన చరణ్(18) అనే బాలుడు అదృశ్యమయ్యాడు. సోమవారం ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడని తండ్రి చిన్నపెద్దులయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ అబ్బాయి ఓపెన్ ఇంటర్ చదువుతున్నాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించండి

పోరుమామిళ్ల, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీ వో ఉపేంద్రరెడ్డిలు సూచించారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీలకు సంబంధించి ప్రధాన రహదారుల్లో రోడ్డుకిరువైపులా ఉన్న వ్యాపారుస్తులతో, గృహస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులకు కొందరు ఆటంకాలు అభ్యంతరాలు తెలపడం వల్ల పనులు కుంటుపడుతున్నాయన్నారు. ప్రభుత్వ స్థలాల వరకు మార్కింగ్ గతంలో ఇచ్చామని, మరలా మార్కింగ్ ఇస్తున్నామని మార్కింగ్ ఇచ్చేవరకు వ్యాపారస్తులు ప్రజలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. లేనిపక్షంలో కాంట్రాక్టర్లు తొలగిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కొందరు వ్యాపారస్తులు తమ అభ్యంతరాలను సమస్యలను వారి దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు ఓబులేసు, ప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఐ కొండారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ సలీం, ఏఈ రజియా పాల్గొన్నారు.

ఎస్.ఉప్పలపాడును సందర్శించిన అధికారులు

జమ్మలమడుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామం ఆదర్శగ్రామం కావడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో సైదున్నీసా, ఈవోపీఆర్‌డీ శివారెడ్డి, ఇతర అధికారులు సందర్శించారు. ప్రధాన రోడ్లకు ఇరువైపుల ఎక్కడైనా అపరిశుభ్రత ఉండరాదని, కాలువలు, రోడ్లు, ఎస్సీ కాలనీ, ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల మైదానం, ఆలయాలు, చర్చిల వద్ద సందర్శించి పరిశీలించారు. నవంబరు 10 నుంచి 15వ తేదీలోపు రాష్ట్ర చీఫ్ సెక్రటరి విజయానంద్ రానున్నట్లు తెలిసింది. అందులో భాగంగా అధికారులు గ్రామాన్ని సందర్శించారు.

పంట నమోదు చేసుకోవాలి

ముద్దనూరు అక్టోబర్21(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈనెల 25 వ తేదీలోపు పంట నమోదు చేసుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. వర్షాలు పడుతున్నందున పంట పొలాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ పరిశీలన

దువ్వూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో నూతనంగా ప్రారంభించిన బస్‌షెల్టర్‌ను మంగళవారం మైదుకూరు డిపో మేనేజర్ శ్రీలత పరిశీలించారు. టీడీపీ నేత పాపినేని రాంబాబుతో కలిసి బస్‌షెల్టర్ సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ సూపరింటెండెంట్ విజయమ్మ, ఈడీసీ లక్షుమయ్య పాల్గొన్నారు.